క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష వితరణ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయానికి సొసైటీ మాజీ చైర్మన్ దండా ప్రవీణ్ రూ.లక్ష వితరణ అందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఈ నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం ప్రవీణ్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యర్రబోయిన నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను బలిపశువులు చేయొద్దు

ఖమ్మంమామిళ్లగూడెం: ఫార్మా పరిశ్రమ ఏర్పాటు విషయంలో రైతులను బలిపశువులను చేయొద్దని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రాబాయి, గౌరవ అధ్యక్షురాలు షేక్.నజీమా అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా రైతులకు సంకెళ్లు వేసిందని, అదే ఫార్ములాను అధికార పార్టీ కాంగ్రెస్ లగచర్ల విషయంలో అనుసరిస్తుందన్నారు. లగచర్ల ఫార్మా పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని రైతుల ఏకాభిప్రాయంతోనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విజయ, ఝాన్సీ, జ్యోతి, భవాని, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇంటర్ విద్యకు విద్యార్థిని ఎంపిక


వెన్నెల

ఖమ్మంరూరల్: ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాదిషా ఫౌండేషన్ ఆధ్వర్యాన గణితంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈనేపథ్యాన మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వెన్నెల ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో ఫౌండేషన్ ఆధ్వర్యాన రాష్ట్రంలోని ఏదైనా కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యకు అయ్యే ఫీజులు, హాస్టల్ సౌకర్యం కల్పించనున్నారు. ఈమేరకు వెన్నెలను పాఠశాల హెచ్ఎం శ్యాంసన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య సేవలు అభినందనీయం

కామేపల్లి: కార్పొరేట్ ఆస్పత్రులు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మార్వెల్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల ఆధ్వర్యాన నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనియాకుల హన్మంతరావు, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు, దొడ్డిగర్ల సుందరం తదితరులు పాల్గొన్నారు.

దూదేకులను బీసీ-ఈలో చేర్చండి

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకులను బీసీ-బీ నుంచి బీసీ-ఈలో చేర్చాలని నూర్ బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా అన్నారు. ఆర్థికంగా, సామాజికరగా అన్ని రంగాలలో దూదేకులను ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఆదివారం జిల్లాకు వచ్చిన తెలంగాణ వెనుకబడిన తరగతుల చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రహీం, లాలు, మహిళా అధ్యక్షురాలు జానీబేగం, షేక్.షకీనాబీ, షేక్.రహీంబాషా, షేక్.సిద్దుబాషా, హుస్సైన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మాజీ మార్కెటింగ్ చైర్మన్ గుండాల కృష్ణ వినతి పత్రం అందించారు. కొత్తా సీతారాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాక ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్‌ల ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు.జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, రాంబాబు,అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గంగపుత్రుల సంఘం ఆధ్వర్యాన సమస్యలపై వినతి అందించారు. జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ, తిరుపతయ్య, రవీందర్, రమేష్, వెంకయ్య, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కంగువ(3డీ)
వినోద	లక్కీభాస్కర్
సాయిరాం	మట్కా, అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	క(2024)

- ఖమ్మంగాంధీచౌక్

రహదారులే కల్లాలు..!


పంట కల్లాలు లేక రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

పంట కల్లాలు లేక కర్షకుల కష్టాలు
- రోడ్లపైనే ధాన్యం రాశులు
- పశువులపాలవుతున్న కష్టార్జితం
- మద్దతు ధర కోసం అవస్థలు
- కల్లాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

ఖమ్మంరూరల్: విత్తనం వేసింది మొదలు పండిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవడానికి రైతులు ఎన్నెన్ని కష్టాలు పడతారో ఇటు అధికారులకు, అటు పాలకులకు తెలియంది కాదు. అయితే రైతులు పడే ఇబ్బందులను తొలగించి వారి అవసరాలు తీర్చడానికి మాత్రం కేవలం కాగితాలపై ఏవేవో కొత్త పథకాలంటూ తీసుకొచ్చి గాలికొదిలేస్తారు. ఆరుగాలం పండించి చేతికొచ్చిన పంటను మద్దతు ధర కోసం ఆరబోయడానికి పంట కల్లాలు లేవు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో రహదారులపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు.

మద్దతు ధర కోసం..

కష్టనష్టాలకోర్చి పంట పండించడం ఒక ఎత్తయితే.. పండించిన పంటను అమ్ముకోవడం రైతులకు తలకు మించిన భారమవుతోంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి పంట చేతికొచ్చింది. అయితే వరిధాన్యాన్ని తేమశాతం వచ్చే వరకూ ఆరబెడితేనే ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర వస్తుంది. లేదంటే అడ్డగోలుగా వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకోకతప్పదు. పాలేరు నియోజకవర్గంలో రైతులు తాము పండించిన పంటను ఎలాగైనా మద్దతు ధర తెచ్చుకోవాలని ఆరాటపడుతూ పంటలను ఆరబెట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గత పది రోజులుగా వరి కోతలు మొదలయ్యాయి. ధాన్యాన్ని అమ్ముకోవడానికి తేమశాతం రావడానికి రోడ్లపైనే ఆరబెట్టడంతో పంటకు రక్షణ లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల పాలవుతున్న పంట..

రోడ్లపై పంట ఆరబోయడంతో పశువుల పాలవుతోంది. పశువులకు పంట ఆహారంగా మారుతుండడంతో రోజంతా పంటకు కాపాలాగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికితోడు రోడ్డుపై వచ్చి పోయే వాహనాలు ధాన్యాన్ని తొక్కుకుంటూ పోవడం, పశువులు తినడంతో అసలే నష్టాల్లో ఉన్న రైతు ఇంకా మరింత నష్టపోతున్నాడనేది యదార్థం. ఇక అకాల వర్షాలు వస్తే ఇక పంట మొత్తం నీళ్లపాలు కాక తప్పదు. ఇప్పటికైనా ప్రతీ రైతు పొలంలో పంట కల్లాలను ప్రభుత్వమే ఉచితంగా నిర్మించి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పశువుల పాలవుతోంది..



నాలుగు నెలలు పెట్టుబడి పెట్టి పండించిన వరి పంటను కళ్లం లేక రోడ్డుపై ఆరబెట్టిన. పంటకు కాపాలా ఉంటున్నా. కనీసం భోజనం లేదా ఇతర పనులకు గంటలోగా వెళ్లొచ్చేసరికి పశువులు తింటున్నాయి. అసలే పంట దిగుబడి రాక, ధరలేక నష్టం వస్తుంటే.. పండిన పంట పశువుల పాలవుతోంది.

– కొక్కిరేణి నాగేశ్వరరావు, రైతు, కిష్టాపురం

రోడ్డుపైనే ఆరబోశా..



రెండు ఎకరాల్లో వరిధాన్యం వేసిన. మిషన్‌తో పొలం కోయించడంతో ధాన్యం పచ్చిగా ఉంది. దీంతో తేమ శాతం రావాలంటే కనీసం పది రోజులైన ఆరబెట్టాలి. చేను పక్కనే రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోసిన. ఇక ఆ ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నా.

– సీహెచ్.వీరయ్య, రైతు, పోచారం

హామీల అమలు కోసం పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

తిరుమలాయపాలెం: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, హామీల అమలు కోసం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ఆరోపించారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో పార్టీ డివిజన్ నాయకుడు పులుగుజు వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన రూ.12వేలు జీవనభృతి అమలుచేయాలని, రైతాంగ రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు, పింఛన్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు అయ్యేంతవరకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య, జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, మీగడ సత్యం, గోకినపల్లి సరోజని, జయమ్మ, పద్మ, వెంకటమ్మ, తమ్మి వెంకటేశ్వర్లు, వీరబాబు,చిరంజీవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల వనసమారాధన


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కందాల

నేలకొండపల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప భక్తుల వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం మామిడి తోటలో అయ్యప్ప సేవా సంఘం గురుస్వామి దేవరశెట్టి వెంకటేశ్వర్లు (డీవీఎల్) ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనగాని నరసింహారావు, మరికంటి రేణుబాబు, కమదన ప్రవీణ్, గొలుసు రవి, వెన్నబోయిన శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కందాల పరామర్శ..

కూసుమంచి: మండలంలోని కోక్యాతండాకు చెందిన వడిత్యా రాజేష్, తేజావత్ రామోజీ ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో గాయపడగా వారిని ఆదివారం కందాల ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే పాలేరులో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, నాయకులు రాంచంద్రు నాయక్, ఇంటూరి శేఖర్, మల్లీడు వెంకన్న, ఆసిఫ్‌పాషా, నూకల మల్లయ్య, వెంకన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు పక్కన బాలపేటతండా సమీపంలో గల మామిడితోటలో ఆదివారం తిరుమల ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈసందర్భంగా 40 కుటుంబాలకు పైగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటల సందడి చేశారు.

24న యాదవ వనసమారాధన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని చెరుకూరి మామిడితోటలో ఈ నెల 24 (ఆదివారం)న అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వనసమారాధనను జయప్రదం చేయాలని యాదవ మహాసభ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం వన సమారాధనకు సంబంధించిన కరపత్రాలను ఓ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మచ్చ శ్రీనివాస్, మేకల మల్లిబాబు, చిలకల వెంకటనరసయ్య, చిత్తారు సింహాద్రి, లోడిగ వెంకన్న, చేతుల నాగేశ్వరరావు, దుబాకుల వెంకటేశ్వర్లు, దుబాకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు ఖమ్మంలో 2025 ఫిబ్రవరిలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. శనివారం రాత్రి డీపీఆర్‌సీ భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 ఏళ్ల తర్వాత ఖమ్మం జిల్లాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, సభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ప్రముఖ విద్యా వేత్తలు ఐ.వి.రమణారావు, రవిమారుత్, కాంతారావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోప్పిశెట్టి సురేష్, విజయలక్ష్మి, ట్రస్మా నాయకులు నాయుడు వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం అందజేత

ఖమ్మం సహకారనగర్: ఎస్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వచ్చే నెల 1వ తేదీన చెరుకూరి గార్డెన్స్‌లో జరగనున్న ఆత్మీయ సమ్మేళనం, వన సమారాధన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు అసోసియేషన్ బాధ్యులు ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కానూరి హిమబిందు, పెద్దినేని రాధాకృష్ణ, వెనిగళ్ల శ్రీనివాసరావు, రాయల రవి, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ పాఠశాలపై అదనపు కలెక్టర్ ఆరా


నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న ఎస్సీ, బీసీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలపై అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆరా తీశారు. పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ పాఠశాల దుస్థితిని వీడియో ద్వారా సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో పాటు జిల్లా అధికారులకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం అదనపు కలెక్టర్ స్పందించి పాఠశాల స్థితి వివరాలపై నివేదిక అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మను ఆదేశించగా ఆయన మండల స్థాయి అధికారులకు సూచించారు. కాగా, అదనపు కలెక్టర్, డీఈఓలు రెండు రోజులలో పాఠశాలను సందర్శించనున్నట్లు సమాచారం.

భక్తులకు అందని అమ్మవారి దర్శనం


ఉదయం 7 గంటల వరకు మూసి ఉన్న ఆలయం

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ నిర్వహణ.. దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అమ్మవారి దర్శనం భక్తులకు అందడం లేదు. ఆయన పూజారి ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా.. సమయపాలన పాటించడం లేదు. కార్తీకమాసం కావడం మళ్లీ ఆదివారం కావడంతో భక్తులు ఉదయమే ఆలయానికి రాగా తాళాలు వేసి ఉండడంతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 7 గంటలు దాటాకే తాళాలు తీస్తున్నారని, దీంతో దేవాలయ హుండీ ఆదాయం కూడా తగ్గిపోతుందని భక్తులు వాపోతున్నారు. ఈ విషయమై దేవాలయ నిర్వాహణాధికారి శేషయ్యను వివరణ అడగగా పూజారి పుల్లయ్యశర్మను పలుమార్లు హెచ్చరించామని, ఉన్నతాధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కర్ణాటక డిప్యూటీ సీఎంను కలిసిన ముస్తఫా


ఎన్నికల ప్రచారంలో ఎండీ ముస్తఫా

ఖమ్మంమయూరిసెంటర్: మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా చండీవాలి అభ్యర్థి మాజీ హోం మినిస్టర్ ఆరిఫ్ నాసింఖాన్ తరఫున ఎన్నికల ప్రచారంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ముస్తఫా పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఆయన సత్కరించారు. అనంతరం డీకేతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం, చెక్కు పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన కె.జయమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం కార్పొరేటర్ లకావత్ సైదులు ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే కె.నరేష్ అనే మరో అనారోగ్య బాధితుడికి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడి కుటుంబానికి అందించినట్లు తెలిపారు.

అటు ఆకలి.. ఇటు చదువు..



తినుకుంటూ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థిని

ఖమ్మంలో గ్రూప్–3 పరీక్ష రాసేందుకు పలువురు మహిళా అభ్యర్థులు తమ చంటి పిల్లలతో కలిసి పరీక్షా కేంద్రాలకు వచ్చారు. రెండు పూటల పరీక్ష ఉండడంతో తమ వెంట భోజనం తెచ్చుకుని మధ్యాహ్న భోజన సమయంలో కేంద్రాల వద్ద పిల్లలతో కలిసి చెట్ల కింద కూర్చుని భోజనాలు చేశారు. తల్లులు పరీక్ష రాసేంత వరకు చిన్నారులు తమ బంధువుల వద్ద బయట వేచి ఉన్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


అభ్యర్థుల సామగ్రిని భద్రపరుస్తున్న దృశ్యం


తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా గ్రూప్-3


కేజీబీవీ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని పలు కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. దేర్ ఇంజనీరింగ్ కళాశాలలో 504మంది అభ్యర్థులకు గాను 234 మంది, కస్తూర్బా గాంధీ పాఠశాలలో 240 మందికి 110 మంది పరీక్ష రాశారు. అలాగే హార్వెస్ట్ పాఠశాలలో 240కి 103మంది, కారుణ్య విద్యాభవన్‌లో 240కి 120మంది, సెట్ లారెన్స్‌లో 240కి 103 మంది, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో 480కి గాను 281మంది, అనిబీసెంట్‌లో 192కి 112మంది, గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో 216కి 118మంది, సెంట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో 240కి 95మంది, ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 480కి 215మంది పరీక్షకు హాజరయ్యారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో విజేతలు, ఆశ్రమ నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ హర్కారాబావి రోడ్ శ్రీ కృష్ణసాయి ఆశ్రమం 25వ వార్షికోత్సవం, కార్తీక మాసం సందర్భంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఖమ్మం నగరస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆశ్రమం నిర్మాణ, నిర్వహణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు న్యూవిజన్ పాఠశాలకు చెందిన టి.భవాని, కె.శ్రీలేఖ, లక్ష్మీప్రసన్నలు గెలుచుకున్నారు. కన్సోలేషన్ బహుమతులు గోర్కీ పబ్లిక్ స్కూలుకు చెందిన టి.చిన్మయి, న్యూవిజన్ స్కూలుకు చెందిన కార్తికేయ, జి.నిహారి, ఎం.చరిత, నిహాల్, ఎన్.దీప్తి, అభినవ్ స్కూలుకు చెందిన కె.బానుప్రకాష్, బేబీమూన్ స్కూల్‌కు చెందిన నిహాల్, హార్వెస్ట్ స్కూలుకు చెందిన వి.ధీరజ్‌లు గెలుచుకున్నారు.

జిల్లా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం వక్తృత్వ పోటీలను నిర్వహించారు. సెల్ ఫోన్ ఉపయోగాలు, నిరుపయోగాలు అంశంపై పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అర్జున్, ఉద్యోగులు కేవీఎస్ఎల్ఎన్ రాజు, ఇమామ్, భాస్కర్, రవి, రోజా, విజయకుమారి, లలితకుమారి, శ్రీనివాస్, కిషోర్, దేవయ్య, విజయరాజు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

కూసుమంచి: బోనస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. సన్న ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంత వరకు దాన్ని అమలు చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు నామమాత్రంగానే ఉపయోగపడుతున్నాయని, ఈ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి బోనస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విచారణ జరిపించాలి


ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిపై దాష్టీకం ప్రదర్శించి గుండు చేయించిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాల బాలుర వసతి గృహం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాల వసతిగృహంలో ఉంటున్నాడు. అయితే ఈనెల 12న రాత్రి విద్యార్థి హెయిర్ కటింగ్ విషయమై సీనియర్స్‌తో చర్చ జరుగగా, విషయం తెలుసుకున్న హాస్టల్లో యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సెలూన్‌షాప్‌లో గుండుచేయించాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తగు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మణ్, శ్రావణ్, శివనాయక్, కౌశిక్, ప్రతాప్, రాజు, సునీల్ పాల్గొన్నారు.

నగరంలో 5కే వాక్ ర్యాలీ


5కే వాక్ ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

ఖమ్మంస్పోర్ట్స్: నెలలు నిండకుండానే జన్మించిన నవజాత శిశువులు(ప్రీటర్మ్ బేబీస్) ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఆదివారం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ నుంచి అంకుర ఆస్పత్రి వరకు 5కే వాక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అంకుర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నం కృష్ణప్రసాద్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ.. ఇప్పుడు ఆధునిక వైద్యంతో అన్ని రకాల రక్షణ ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ (ఐఏపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, కూరపాటి చిల్డ్రన్స్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏడాది నవంబర్ 17న ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకుర ఆస్పత్రి బంజారా హిల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్, ప్రముఖ వైద్యులు యలమంచిలి నాగమణి, భరత్ కుమార్, సాయిభార్గవ్, మోపర్తి సురేష్ బాబు, శ్వేత, జ్యోత్స్న, రాజ్‌కుమార్, బాబురావు, జాకీర్, హుమా, శివకుమార్, సింధు, కల్పన, సాయిప్రసన్న, అపర్ణ, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఫీజుతో అత్యాధునిక వైద్య సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ఖమ్మంవైద్యవిభాగం: ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి సంబంధించి రింగ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీని పేదలకు అతి తక్కువ ఫీజుతోనే ఖమ్మంలో అందిస్తున్నట్లు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా, నేడు(సోమవారం) టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్ ఆస్పత్రిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు పాల్గొని ప్రారంభిస్తారని, ఈ యూనిట్‌ను వైరా రోడ్డులోని పాత ఆరోగ్య ఆస్పత్రి భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదలకు మరిన్ని సేవలు అందించాలని నూతన ఆస్పత్రిని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ తోట రామారావు, ఆయన సతీమణి కార్పొరేటర్ తోట గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, ఆయన సతీమణి కార్పొరేటర్ శీలంశెట్టి రమ తదితరులు పాల్గొన్నారు.